# గుసగుస పెళ్లి

"ఏమీ ఫర్వాలేదు. నీకేమీ తగాదా రాదులే, ఏమన్నా శృతిమించివస్తే నీ ప్రాణానికి మా ప్రాణం అడ్డు వేస్తాం, మాది పూచీ, ఇక్కడ పరాయివాళ్లు ఎవళ్లూ లేరులే," అని మేం ఎంతో భరోసా యిచ్చాం తరువాత కుంభయ్యశాస్త్రి తన అనుభవం ఈరీతిగా మాతో చెప్పాడు.

అయ్యా! మనవి చేసుకుంటాను. పెద్దలూ, బంధువులూ, పెళ్లడీ, లేని వివాహాలు ఎన్ని వందలవుతున్నాయని మీరూహ! డబ్బుఖర్చు తగ్గుతోందిగదా అని వీట్లకి మోజు ఎక్కువవుతోంది. వీట్లకి ముహూర్తపు పట్టింపులు లేవు. అసలు రాజ్యాంగపు జబర్దస్తీలకి పంచాంగపు ముహూర్తాలు పాటించవలసిన అవసరం లేదు. ఏది వీలుగా ఉంటే అదే సుముహూర్తం. ఛస్తారా ఏమిటి ధర్మచ్యుతి అయేటప్పుడు!

నిన్నరాత్రి మా నాన్న నాలుగు పెళ్లిళ్లు వరసని చేయించడానికి బజానా కాదు సొమ్మంతా పుచ్చేసుకున్నాడు. మూడు చేయించడానికి తనికి వీలుందని అంచనా వేసుకున్నాడు. నాలుగోది నన్ను వెళ్లి చేయించమన్నాడు పెళ్లి చేయించడం అంటే ఇదేమన్నా కూర్చుని వస్తువు చేయించడంలాంటిదా! నాకు పెళ్లి చేయించడం రాదు. చాలా రావు అందులో అదోటీ! తమకే తెలుసు. అయినాగానీ

వెళ్లాను. చూసిచూసి ఈకాలంలో రూపాయలు పోగొట్టు కోనా మరి!

ఆడపెళ్లివార్ని నే నెరగను. మగపెళ్లివార్ని అసలే ఎరగను. వాళ్ల పేర్లూ గోత్రాలూ వగైరా నాకేమీా తెలి యదు. రాత్రి ఒంటిగంటకి ఈవూళ్లో రైలు దిగినట్టు ఒం టెద్దుబళ్లమీాద వాళ్ళు పెద్దింటివారి దొడ్డిదగ్గిరి కొచ్చారు. ఆ యింటివారంతా మూడోకాలం నిద్రలో ఉన్నారు. ఏర్పాటు ప్రకారం వారిదొడ్లో రహస్యంగా రాత్రిళ్ళు వివా హాలు అనేకం పిట్టకి తెలియకుండా అయిపోతుంటాయి. నేనూ అక్కడికి వెళ్లాను. ఒక బండీలోంచి ఒకపిల్లా తల్లిదం డ్రులూ ఇద్దరు వితంతువులూ దిగారు. రెండు పెద్దగోనీ సం చులుకుడా వాళ్ళు మెల్లిగా కిందికి సాయంపట్టారు. రెండో బండీలోంచి ఒక కుర్రాడూ తల్లిదండ్రులూ మరిద్దరు దంప తులూ దిగారు. వాళ్లూ కొన్ని పెట్టెలు చప్పుడనేది లేకుండా దింపారు. అంతాలోపల జేరాం. వీళ్లతో ఒక చాకలీ వాళ్లతో ఒక నౌఖరూ వచ్చారు. వాళ్ల చేతికి ఒక ఈల ఇచ్చి, కర్మవశంచేత ఏపోలీసులేనా, కిట్టనివాళ్ళేవళ్ళేనా, పసికట్టి వస్తూన్నట్టాయినా అది ఊదితే మేం లోపల మా జాగర్త మేంపడతాం అని వాళ్ళతో చెప్పి వాళ్లని బయట నిలేశాం. నా బిచాణా నేను ఒక పక్కని పెట్టాను. 'బిచాణా ఎందుకట్యోయ్?' అని మీారు ప్రశ్నించగలరు. "ఎవడేనా తణిఖీకొస్తే నేను అమాంతంగా అది పరిచేసి గాఢంగా నిద్ర

పోతూన్నట్టు కనపడ్డానికి. జీలకర్రా బెల్లం ఉన్నాయా అని నేను ఒక వితంతువుని అడిగాను. సిద్ధంగా నే ఉన్నాయని ఆవిడ అంది. పెళ్ళి అంటే నాకు తెలిసింది అంతే. మంగళ సూత్రాలు నా చేతికిచ్చారు. అవాంతరం ఏదేనా వస్తే నేను వాటిని బుగ్గని పెట్టుకోవలసి ఉంటుందని వాళ్లు తీర్మానం చేశారు. ఏదో ఏడుస్తాను, మంగళాస్నానాలు కానీమని నేను వాళ్లని తొందర చేశాను. "కాసిని వేణ్ణీళ్ళైనా లేక పోయాయిగదా" అంటూ ఒక వితంతువు ఏడవడ మొదలెట్టింది. ఆవిణ్ణి నిమ్మళంగా ఏడవమని కోప్పడ్డాం. ఇంకో ఆవిడ నిశ్శబ్దంగా నీళ్లు తోడింది. అవేనా మీద పోసేటప్పుడు ధ్వని అవుతుందేమో అని భయమేసి, ఊరికే తడిగుడ్డ పెట్టి వొళ్ళుతుడిస్తే చాలని నేను అన్నాను. శాస్త్రం అల్లా ఒప్ప దని పెళ్ళికొడుకు తండ్రి మహా ఎగరడం మొదలెట్టాడు, బోడి ఎగరడం వీడూనూ! నాకు డబ్బు వెనకే ముట్టిపోవడం వల్ల నేను నిర్భయంగా ఓ కఠినమైన శ్లోకం చదివి దానికి అర్థం 'ధర్మంనిలబెట్టడానికి అధర్మం చెయ్యొచ్చు, చెయ్యాలి' అని మెల్లిగా చెప్పి ముహూర్తం, దాటపెట్టొద్దని కూకలేశాను. మూడుగంటల ముప్పైఅయిదు నిమిషాలకి ముహూర్తం. గడియారం ఎవరి దగ్గిరా లేదు. చటుక్కున నేను మహా తెలిసినట్టు నక్షత్రాల కేసి చూసి 'సరే, ఇంకా బలువుగా రెండుగడియల వ్యవధి ఉంది' అన్నాను. అల్లా అనడం మరీ బాధై పోయింది. నేను ఝుణ ఝుణా మంత్రం చెప్పటం

లేదని కన్యాప్రదాతకి నా మీద ఇంతమట్టుకుంది. అందుకని పైకి వినపడ్డం ప్రమాదం గనక నేను అవసరం చెప్పిన మంద్రస్థాయిలో మాట్లాడుతున్నట్టు నటించి తల ఎగరేసి పెదిమిలు కదుపుతూండే సరికి మొహా నోరూ నెప్పెట్టి చచ్చాను. ఈ ఘడియ వరకూ అవి స్వాధీనంలేవు. ఆవళంగా పెళ్ళికూతుర్ధతల్లి, "ఇంత డబ్బోస్తున్నా నా పిల్లకి ఒక్క ముచ్చటా తీరలేదు కదా! అసలు పల్లకీ అంటే దానికెంతో అంత మనసు! బాజాలంటే దానికి అన్నం అక్కర్లేదు. రాత ఇల్లా ఉంటే అవన్నీ ఎల్లా వస్తాయీ! అందులో మొగాళ్ళ పురమాయింపులు! అయ్యో! బతుకు!" అంటూ రాగాలెట్టి ఊహూ చీస్తూ కూర్చుంది. పెళ్లికొడుకు అప్పగారొచ్చి పానకబ్బిందిలేనా లేకపోవడం ఆడపెళ్లివారి మొహంలా ఉందని తిప్పుకొని ఆడింది. పెళ్లికొడుకు తండ్రొచ్చి "తాంబూలాలప్పుడు ఈ బాజాల సంగతి మీరు ఏమాత్రం మాతో ఊదినా, డోళ్లూ అవీ పెద్ద రావణాచప్పుడు కాకుండా కాస్త తడిపించేనా నేను తెప్పించి ఉండేవాణ్ణి. ఊరేగడానికి వీలంటూ లేదు గనక పల్లకీ మానేశాం. లేకపోతే భాగ్యమా? మా విస్తళ్ల దగ్గిర రోజూ మేం పారేసే మెతుకుల పాటి విలవ లేదు మీరు కోరేవాట్ల విలవంతా! అది మాకు ఓ లెఖ్ఖా ఓ పత్రమా" అని సమర్థించుకోవడం మొదలెట్టాడు. కన్యాప్రదాత, "ఇక్కడేనా కాస్తోకూస్తో దొడ్డిఅంటూ ఏడిసింది కాదుటమ్మా! పోనీ యథాశక్తి దొడ్లోనే ఊరేగి ఉందుం.

ఏదో రవంత పల్లకీ లాంటిది తీసుగొచ్చి మరీ ఏడవకపోయావూ! ఊరేగితే ఎవడేనా పట్టుగుంటాడుగాని, దొడ్డెగితే నీకొంపేం ములిగిందీ!" అని అందుకున్నాడు.

వియ్యంకుడు—"పిల్లేక పోయిందని చెబుతున్నాను, గ్రహించండి. అక్కగార్ని నిమ్మళంగా ఇదవమనండి. ముహూర్తం ఇంకా కాలేదామె మరి. ఇప్పణ్ణించీ ఊహూ రాగా లెందుకూ! అనుకున్న లాంఛనాల్లో ఒక్కటీ జరక్క పోయినా మేం నోరు నొక్కుకొని కుక్కినపేనల్లా ఊరుకో లేదూ!" అన్నాడు.

కన్యప్ర—ఇప్పుడు నీకు లోటొచ్చిన లాంఛనా లేమిటోయ్ ?

వియ్యం—"ఏమోయ్" అనా, నన్నంటున్నావ్ (అని కళ్లెఱ్ఱచేశాడు)

నేను—(పళ్లు బిగించి) అబ్బ! నిమ్మళం! మెల్లి మెల్లిగా తిట్టుకోండి.

కన్యాప్ర—"ఏమోయ్" కాదు, "ఏమిరా" అని కూడా అంటాను మళ్ళీ నోరెత్తితే. తాంబూలాలనాడు నువ్వు అయిదు వందల ఎనభైయ్యారు లెఖ్ఖెట్టి పుచ్చుగున్నావ్. పూటా రూపాయిలని ఆరు తీసెయ్యించి, ఖంగున మోగేవి అందులో వేస్తేగాని ఉరెట్టుగుంటానన్నావ్, అందులో లేవూ నీలాంఛనాలన్నీ!

వియ్యం—లేవు (అని ధిక్కరించి చూశాడు)

కన్యాప్ర—ఉన్నాయి! ఉన్నాయంటూంటే ఏమిటది పోట్లగేదిలా అల్లాచూస్తావ్!

అంటూ వియ్యంకు లిద్దరూ చెయ్యీ చెయ్యీ కలుపుకోవడం లోకి వచ్చింది. ఆ సమయంలోనే, వాణ్ణి తగలెయ్యా, చాకలాడు వీధులోంచి ఈలేశాడు. నాకు పైప్రాణాలు పైన పోయాయి. తక్షణం నేను ధైర్యం తెచ్చుకొని కంబళీ ఓటి తీసి వియ్యంకు లిద్దరికీ ములగా ముసుగేసి, వాళ్లని అందులో తగ్గస్థాయిలో దెబ్బలాడుకోండని, నాపక్క విప్పి పరుచుకొని, తక్కిన వాళ్లందర్నీ ఒరగమని సంజ్ఞచేసి, మంగళసూత్రాలు-తీరానోట్లో పెట్టుకుంటే ఎవడేనా శత్రుమధ్యం వెధవొచ్చి, నన్ను సాచి లెంపకాయకొడితే ఊడి ఇవతల పడతాయేమో అని భయపడి—రొండిని దాచేసుగుని, పడుకుని, దుప్పటీ తీసి రాయిలా తొక్కిపెట్టి మేకు బందీచేసి ముసుగెట్టాను. ఒక్క నిముషం నిశ్శబ్దంగా సమాధిలా ఉంది. ఎవరో పైనించి తలుపు తట్టారు. తప్పకుండా పోలీసు యములాళ్ళే అయిఉంటారనుకుని నేను స్ఫుటంగా హెచ్చుస్థాయిలో గుర్రు ఝుమాయించాను. తలుపుమళ్లీకొట్టి మళ్ళీకొట్టి అవతలకుంక ఆగిపోయాడు. వెంటనే గభీమని ఎవడో దొడ్లోకి దూకాడు. నాకు నిజంగా ప్రాణం గక్కురుమని గుండె నోట్లో కొచ్చినట్టయింది. "బాబుగారండి, ఓమూ లేడండి. నేను సాకల్నండి" అన్నాడు ఆ వచ్చిన చచ్చినాడు. "ఓరి వెధవగడరా, వెధవా" అనుకున్నాను నేను. "ఆడూ నేనూ

ఈలకోసరం పట్టింపులోయాం అండి. నేనుగత్తే ఈలనోట్టో వొట్టుగునే ఆడిమీాద కలమడ్డానుండి. అల్లానే ఆణ్ణి తిట్టడంలో కాంతంతకూసినట్టు తమరికిగాని యినమడింది గాబోసును!" అంటూ కూడా తమరి దెబ్బలాట సంగతి ఆపీనుగు చెప్పాడు. ఈపాటికి ముసుగులోంచి పైకొచ్చి వియ్యంకుల మీాది కంబళీ తీసి వాళ్ళని బహింరంగ పరిచాను. అప్పటికి వియ్యంకులు యజ్ఞోపవీతాలు తెంపుగోడం పూర్తి కాగా, ఒకరి శిఖ ఇంకోరిచేతుల్లో పట్టడి ఉండగా, తలుపు చప్పుడు వల్ల ఆగి ఒకర్నొకరు మోరచూపు చూస్తూఉన్నారు. అప్పుడు నేను కలగచేసుగుని, శబ్దం చెయ్యకుండా గొంతికలట్టుగుని ఇద్దర్నీ గుంజి, లేవదీసి ముక్కుమీాద వేలేసుకొని, చాకల్ని మళ్ళీ కాపలాకి సాగనంపి, కన్యాప్రదాతచేత పెళ్ళికొడుకు కాళ్ళు కడిగింపించి, పెళ్ళికూతుర్ని తీసుగురమ్మని సంజ్ఞచేశాను. ఓ వితంతువు తన సంచీలో దాచి తెచ్చిన తట్ట పట్టుగొచ్చి పెళ్ళికూతుర్ని అందుల్లో కూచోమంది. అని, 'మేనమామ రాలేదు. పెళ్ళికొడుకు బావగార్ని తట్టతీసికెళ్లమనండి. మా పిల్లంది తట్టుల్లో తలవంచుగు కూచోడం చూసి మురిసిపోవాలని మేం ఉన్నాం' అనికూడా అంది. అల్లానే నేను చెయించి, "ముహూర్తం దగ్గిరికొచ్చి మీాద పడిపోతోంది, తెండి జీలకర్రా బెల్లమూ" అన్నాను. అని ప్రవరకొంచెం చెబుదాం అనుకునేసరికి, పిల్లిద్దరి గోత్రాలూ ఒకటే, వీళ్ల ముహాం ఈడ్చా! అంతా తెల్లపోయారు. శాస

సమాళించుగుని కన్యాప్రదాతఅప్పగా రొచ్చి, "ఏమిరా! తమ్ముడూ! శాస్త్ర గోత్రం సంగతి చూసుగోరుట్రా, ఇంత ఖర్చూ పెడుతూనూ!" అంది. అతను, "ఏమో, నాకేం తెలుసూ! మీరంతా తాంబూలాలుచ్చుగోడం అంటూ అట్టహాసం చేసి వార్నీ వీర్నీ కేకేస్తే, వెల్లడయి కొంప తవ్వు తుంది వద్దు కాక వద్దని, నాలిక తెంపుగున్నారుగా! తాంబూ లాలప్పుడు వాడూ నేనే ఉటా! ఆ వెధవ ఊహూ మళ్ళీ మళ్ళీ రూపాయిలు లెఖచూసుగోడమే! నేను పిల్లకి ఎల్లా నేనా కన్నె చెరవదిలించి ధర్మం ఎల్లానో నిలపెడదాం అనే!" అన్నాడు. మనస్సుల్నిబట్టి చూస్తే వివాహానికి స్త్రీ పురుషు లై తేసరి, గోత్రం పట్టింపు లేదని బుకాయిద్దాం అంటే, నాకు ధైర్యం చాల్లేదు. 'అయితే మరి నాకు సెలవు. ఉంటాను." అన్నాను నేను. పెళ్ళికొడుకు తండ్రి అమాంతంగా నా రొంటి నున్న మంగళసూత్రాలు—అక్కడుండడం ఎప్పుడు చూశాడో ముండావాడు—ఊడలాగి పుచ్చుకున్నాడు. ఒక వితంతువు కళ్యాణం రావాలమ్మా! కళ్యాణం రావాలీ! నేను కళ్ళారా చూద్దాం అని ఇబ్బందైనాసరే చూరికిబుట్టెడు తలంబ్రాల బియ్యం మూటకట్టి తెచ్చాను. పాపిష్టికళ్లకి ప్రాప్తం లేదు." అని దుఃఖించింది. అంతా లేచి కళ్లు నులుముకుంటూ తలో మాటా ఆడారు. ఈ సందులో, కన్యాప్రదాత నన్ను పక్కకి లాక్కెళ్లి "మీకు ప్రమాణపూర్తిగా చెయించడం వచ్చా!" అని అడిగాడు. "రామ రామ! నాకు రాదండి" అని లబ్బున మొత్తుగున్నాను. వెంటనే ఆయన ఒక పదిరూాయల కాగితం నా మీద పారేశాడు. పారేస్తూ, "నయమే!

మీాకే అసలు మంత్రాలన్నీ వచ్చి ఉంటే ఈపాటికి చావవలి సొచ్చేది" అని నన్ను పొగిడాడు. తరవాత అతను 'నా రూపాయిలు ఇవ్వకుండా వీధులోకాలెట్టావంటే, రెండో కాలుఉండదు. జాగర్త!' అని వియ్యంకుణ్ణి—ఇహను అల్లా అనకూడదు గనక—ఆ రెండోవాణ్ణి నిలేశాడు. వాడు 'చాల్లే! జీలకర్రా బెల్లం మినహాయింపుగా వివాహం. వివాహంతాలూకు హైరానా, యావత్తూ అయింతరవాత ఇప్పా డెల్లా కట్నంవెనక్కి-య్యడం?' అన్నాడు. 'ఓరి నీతాడు తెంపా, అల్లాయితే దూట బిళ్లల్లాంటి రూపాయిలు లాగేస్తా వుట్రా' అని పెళ్ళికూతురుతండ్రి పందిరిగడ గుంజ దొరక పుచ్చుగున్నాడు. ఆమట్టుగా పందిరికి వేళ్ళాడగట్టిన హరికేన్ లాంతరు ఊగిసలాడి దిబ్బుమంది. ఆ చీకట్లో నేను నా బిచాణా పోగుచేసుగుని ఇవతలపడి, ఇల్లుచేరేదాకా వెనకచూపు లేకుండా అదేపరుగు!

ఒకవేళ గోత్రాలు సరిపడి, అది ఖాయంగా పెళ్లే అయిఉండి, తరవాత మొగుడూ పెళ్ళాలకి తగాదాలొచ్చి, మొగుడు పెళ్ళాన్ని వదిలేస్తానని బెదిరించడంలో, ఆ పిల్ల తన పెళ్ళామే కాదని అంటే, అప్పుడు అసలు నిజంగా పెళ్ళి జరిగిందా అనే సంగతిగురించి సాక్ష్యం కావలిసొచ్చినా, నేను యుగం తిరిగినా సాక్ష్యం ఇచ్చిఉండను. నాకు పెళ్ళి చెయ్యించడం రాదని మీారు సాక్ష్యం, అందుకే ఈసంగతి నేను తమతో మనవిచేసుగున్నాను.

అని చెప్పి, కుంభయ్యశాస్త్రి, సంగతి ముగించాడు.

(సెప్టెంబరు 1938)